క్లుప్తంగా

రెండు రోజులు జొన్న కొనుగోళ్లు బంద్

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన జొన్న కొనుగోలు కేంద్రాన్ని ఈనెల 6, 7న రెండు రోజులు బంద్ చేయడం జరుగుతుందని పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరిగి ఈనెల 8న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడం జరుగుతుందన్నారు. మండల రైతులు గమనించి అధికారులకు సహకరించాలని కోరారు.

నవ్వుతో ఆరోగ్యం



నవ్వుల దినోత్సవంలో పాల్గొన్న సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: నవ్వడంతోనే ఆరోగ్యంగా ఉండవచ్చని లాఫింగ్ వ్యాయామ శిక్షకురాలు మధు సింగ్లా అన్నారు. ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రస్తుత కాలంలో మనిషి ఒత్తిళ్లతో జీవనం కొనసాగిస్తున్నారని అన్నారు. యోగాతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని సూచించారు. ప్రతిరోజు పార్కులో మహిళలతో లాఫింగ్ వ్యాయామం చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జ్యోతి వైద్య, శైలజ, శిల్ప, సాక్షి, అనుపమ, సుజాత, కమల, లక్ష్మి పాల్గొన్నారు.

సహజ పానీయాలు తీసుకోవాలి

ఆదిలాబాద్‌టౌన్: సహజ పానీయాలను తాగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రిమ్స్ ఆస్పత్రి పిల్లల వైద్య నిపుణుడు తిరుమల్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో ఆదివారం విద్యార్థులకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మంచి ఆహార అలవాట్లను పాటిస్తే ఆరోగ్యంగా ఉండవచ్చని సూచించారు. జంక్, బేకరీ ఫుడ్‌లను తీసుకోవద్దన్నారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బెదోడ్కర్ సంతోష్ కుమార్, నూతుల రవీందర్, ఉపాధ్యక్షుడు గంగన్న, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన కుమ్మరి భోజాబాయి ఇటీవల మృతి చెందగా తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వాహనాల తనిఖీ

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కొత్తగూడ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ ప్రచారం ముగించుకొని వెళ్తుండగా పోలీసులు చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని ఆపి తనిఖీలు చేశారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని పోలీసులు సూచించారు. కార్యక్రమంలో ఆమె వెంట బీఆర్‌ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, ఆబిద్, రమేశ్ పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ వైస్ ఎంపీపీ బాలాజీ, మండల అధ్యక్షుడు కందుకూరి రమేశ్, కుటికెల ఆశన్న, జాదవ్ సుమన్‌బాయి, మాజీ జెడ్పీటీసీ జగ్జీవన్‌లు బీఆర్‌ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. ఆదివారం మండలంలోని ఎక్స్‌రోడ్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ అభ్యర్థి గోడం నగేశ్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా గోడం నగేశ్ వారికి కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కొండేరి రమేశ్, తన్నీరు సతీశ్ దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్



ఓటు హక్కు వినియోగించుకున్న శిక్షణ పోలీసు కానిస్టేబుళ్లు

బోథ్: పోస్టల్ బ్యాలెట్, హోంఓటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. బోథ్ నియోజకవర్గవ్యాప్తంగా ఆదివారం 176 మంది ఉద్యోగులు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. హోం ఓటింగ్ ద్వారా 103 మంది ఓటు వేశారు.

ఆదిలాబాద్‌లో శిక్షణ కానిస్టేబుళ్లు..

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని పోలీసు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న కానిస్టేబుళ్లు ఆదివారం ఓటు హక్కు వినియోగించుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.

జోరుగా జొన్న కొనుగోళ్లు

- బేల సబ్‌యార్డులో గత నెల 22న ప్రారంభం
- ఇప్పటికే 4051 క్వింటాళ్లు కొనుగోళ్లు పూర్తి
- రైతుల ఖాతాలో జమకానీ డబ్బులు



జొన్న కొనుగోళ్లను పరిశీలిస్తున్న సీఈవో తిరుపతి

బేల: మండల కేంద్రంలోని సబ్ యార్కెట్‌యార్డులో గత నెల 22న జొన్న కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. క్వింటాలుకు రూ.3,180 మద్దతు ధరతో ఇప్పటికే 4,051 క్వింటాళ్ల వరకు కొనుగోళ్లు పూర్తయ్యాయి. దీంతో పాటు ఈనెలాఖరు వరకు కొనుగోళ్లు కొనసాగనున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రకటన రావడంతో ఇక నుంచి జొన్న ఎకరానికి 12 క్వింటాళ్ల చొప్పున కొనుగోళ్లు చేపట్టనున్నారు. ఇప్పటిదాకా చేపట్టిన జొన్న కొనుగోళ్లకు రైతులకు మాత్రం డబ్బులు రాలేదని వాపోతున్నారు.

4,051 క్వింటాళ్ల కొనుగోళ్లు..

గతంలో జైనథ్ మార్కెట్ కమిటీ పరిధిలోని బేల సబ్ మార్కెట్‌యార్డులో జొన్న కొనుగోళ్లు ఉండేవి కాదు. 2021 రబీ సీజన్‌లో స్థానికంగా యార్డులో జొన్న కొనుగోళ్లను మార్క్‌ఫెడ్ సౌజన్యంతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్నారు. దీంతో క్రమక్రమంగా సాగు పెరిగి ఈసీజన్‌లో దాదాపు రెండున్నర వేల ఎకరాల్లో జొన్న పంటను సాగు చేశారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం కాకుండా కోతలు పూర్తయిన క్రమంలో జొన్న పంటను అరబెట్టి సబ్ మార్కెట్‌యార్డుకు రైతులు తీసుకువస్తున్నారు. ఈనెల 2 వరకు 139 మంది రైతుల నుంచి 3,163 క్వింటాళ్ల జొన్న కొనుగోళ్లు పూర్తయ్యాయి. రైతులు బారులు తీరడంతో 3న మరో 18మంది రైతుల నుంచి 348 క్వింటాళ్లు, 4న తేదీన 26 మంది రైతుల నుంచి ఏకంగా 540 క్వింటాళ్లను అధికారులు కొనుగోలు చేశారు. ఇప్పటిదాకా మొత్తంగా 183 మంది రైతుల నుంచి 4,051 క్వింటాళ్ల జొన్న కొనుగోళ్లు పూర్తయ్యాయి. ఇంకా 15 వేల క్వింటాళ్ల పైబడి జొన్నలు యార్డుకు వచ్చే అవకాశం ఉంది. ఈనెల 6, 7 తేదీల్లో యార్డులో కొనుగోళ్లు ఉండవని, జొన్నలు అరబెట్టి తేమశాతం 14కు మించకుండా ఉండేలా జొన్నలు తీసుకురావాలని మార్క్‌ఫెడ్ అధికారుల సూచనలతో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధికారులు చెబుతున్నారు.

ఎకరాకు 12 క్వింటాళ్ల కొనుగోళ్లు..

ఇటీవల వరకు జొన్న ఒక ఎకరాకు 8.85 క్వింటాళ్ల చొప్పున కొనుగోళ్లు చేశారు. ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి రావడంతో రైతుల నుంచి డిమాండ్‌తో శనివారం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రకటన రావడంతో ఇక నుంచి ఒక ఎకరాకు 12 క్వింటాళ్ల చొప్పున కొనుగోళ్లు చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

డబ్బుల కోసం ఎదురుచూపు

బేల సబ్‌యార్డులో ఇప్పటి దాకా 183మంది రైతుల నుంచి 4,051 క్వింటాళ్ల జొన్న కొనుగోళ్లు పూర్తయ్యాయి. ఈక్రమంలో రైతులకు ఏమాత్రం డబ్బులు రాలేదు. దీంతో రైతులు డబ్బుల కోసం ఎదురుచూస్తున్నారు. రైతుల నుంచి కొనుగోళ్లు పూర్తయిన క్రమంలో నాలుగైదు రోజుల్లో సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కావాల్సి ఉంటుంది. కానీ కొనుగోళ్లు ప్రారంభమై 13 రోజులు గడుస్తున్నా.. ఇప్పటి వరకు డబ్బులు జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డబ్బుల ఊసేలేదు



గత నెల 25న బేల సబ్‌యార్డులో 42 క్వింటాళ్ల జొన్నలను అమ్మిన. ఇంకా ఎటువంటి డబ్బులు రాలేదు. అధికారులను అడిగితే వస్తాయని చెబుతున్నారు. కానీ ఎప్పుడు వస్తాయో స్పష్టంగా చెబుతలేరు. రాష్ట్ర ప్రభుత్వం, అధికారులు స్పందించి ఈ డబ్బులు సకాలంలో రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలి.

– బుబన్ దశరథ్, రైతు మశాల (బి)

15క్వింటాళ్లు కొనుగోలు చేయాలి



జొన్నలు ఎకరాకు కేవలం 8.85 క్వింటాళ్ల కొనుగోలు చేయడం సరికాదు. ఈసారి ఎకరాకు ఆశించిన మేర 15 నుంచి 20 క్వింటాళ్ల జొన్నలు దిగుబడి వచ్చాయి. ప్రభుత్వం ఎకరాకు 12 క్వింటాళ్ల పెంచిందని అంటున్నారు. దీన్ని 15 క్వింటాళ్లకు పెంచాలి.

– మాలేకార్ బాబారావు, సాంగిడి

గాడి తప్పిన ప్రత్యేక పాలన



తాత్కాలిక బస్టాండ్ వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

- పారిశుధ్యంపై పట్టింపు కరువు
- కుక్కలు. పందుల స్వైరవిహారం
- మూడు నెలలుగా కార్మికులకు అందని వేతనాలు

ఇచ్చోడ: ఇచ్చోడ గ్రామ పంచాయతీలో పాలన పూర్తిగా గాడి తప్పింది. పాలకవర్గం పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం పంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించింది. ప్రత్యేకాధికారుల పాలనలో పంచాయతీ ఇన్‌చార్జి ఈవో ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఒక్క పక్క మండుతున్న ఎండలతో పలు కాలనీలో మిషన్ భగీరథ నీరు సరఫరా కావడంలేదు, మరో పక్క రోడ్లపై చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు ఇన్‌చార్జీ ఈవో అందుబాటులో లేక పోవడంతో చిన్నచిన్న పనులకు సైతం ప్రజలు పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు.

బయటకు వెళ్లేందుకు జంకుతున్న జనం..

పంచాయతీ పరిధిలో కుక్కలు, పందులు, కోతులు స్వైర విహారం చేస్తున్నాయి. కుక్కలు గుంపులు గుంపులుగా రోడ్లపై తిరుగుతుండటంతో చిన్న పిల్లలతో పాటు పెద్దలు బయటకు వెళ్లేందుకు జంకుతున్నారు. ఇక పందులు రోడ్లపై సంచారిస్తున్నా.. పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. కోతులు ఇళ్లను పీకి పందిరేస్తున్నాయి. కోతుల దాడుల్లో పలువురు మహిళలు గాయపడిన ఘటనలు ఉన్నాయి.

అందుబాటులో ఉండని ఈవో..

పంచాయతీ కార్యాలయంలో ప్రజలకు ఇన్‌చార్జీ ఈవో అందుబాటులో ఉండడని ప్రజల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్నచిన్న పనులకు సైతం ఈవో కోసం రోజుల తరబడి పంచాయతీ కార్యాలయం చుట్టూ తిరిగిరావాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే గత మూడు నెలలుగా పంచాయతీ పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వడం లేదు. మేజార్ పంచాయతీకి అనేక రకాల ఆదాయ వనరులు ఉన్నా.. వేతనాలు ఇవ్వక పోవడంపై కార్మికులు, ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటిపన్ను రూ. 25 లక్షలు...

ఈ ఏడాది ఇంటి పన్ను రూపంలో మార్చి 31 వరకు దాదాపుగా రూ. 25 లక్షల వరకు వసూలు చేసినట్లు సమాచారం. వసూలు చేసిన పన్నును ట్రెజరీలో జమ చేసి వాటిని పంచాయతీ అభివృద్ధికి వాడుకునే అవకాశం ఉంటుంది, కానీ వసూలు చేసిన పన్నులకు సైతం సరైన లెక్కలు లేవని ఆరోపణలు లేక పోలేదు. రోజు వారి సంత, వారసంత, పశువుల, మేకల సంత, అద్దె గదుల ద్వారా పంచాయతీకి భారీగా ఆదాయం వస్తున్నా.. అధికారుల చేష్టలతో అభివృద్ధిలో మాత్రం వెనకబడి పోయి ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉందని స్థానిక ప్రజలు వాపోతున్నారు.

'గెలుపే ధ్యేయంగా ముందుకెళ్లాలి'



ఇచ్చోడ: మాట్లాడుతున్న రాములునాయక్



ఎదులాపురం: ప్రచారం చేస్తున్న నాయకులు

ఇచ్చోడ: కార్యకర్తలు, నాయకులు గెలుపే ధ్యేయంగా ముందుకు వెళ్లాలని మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బోథ్, ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యేలు రాథోడ్ బాపురావు, రేఖానాయక్‌లతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలలో ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సమావేశంలో బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

ఎదులాపురం: ఇండియా కూటమి అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని సీపీఎం నాయకులు లంక రాఘవులు, బండి దత్తాత్రి అన్నారు. ఆదివారం పట్టణంలోని రణదీవనగర్‌లో ఇంటింటా ప్రచారం చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూసం సచిన్, ఎ.కిరణ్, జమున, మంజుల శకుంతల, పోచక్క పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: ఇండియా కూటమి అభ్యర్థి ఆత్రం సుగుణను ఎంపీగా గెలిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పూసం సచిన్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ సంతలో సుగుణ మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభించే పార్టీలకు బుద్ధి చెప్పాలన్నారు. నాయకులు కనక మల్కు, మడావి నాగోరావు, తుంరం ఈశ్వర్, కోవా సునీల్ పాల్గొన్నారు.

నార్నూర్: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ నాయకుడు బానోత్ గజానంద్ నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని గుంజాల, తాడిహత్నూర్, ఎంపల్లి, భీంపూర్, మాలేపూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో లోకండే దేవరావు, బిరుజులాల్, రాథోడ్ ఉత్తమ్, దాదే అలీ, నర్సింగ్ మోరే, కాంతారావు, జాకీరుల్లా ఖాన్ పాల్గొన్నారు.

బీజేపీకి బుద్ధి చెప్పాలి

కైలాస్‌నగర్: నిత్యావసర ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరిచిన బీజేపీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని హనుమాన్‌నగర్‌లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌లోనే పేదల సంక్షేమం సాధ్యమన్నారు. కార్యక్రమంలో నాయకులు లింగన్న, నాని, ప్రభాకర్, నాగరాజు, విష్ణు, రంజిత్, నాగన్న, వెంకటేశ్, చంటి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన బీసీ సంఘం ఉపాధ్యక్షుడు ప్రశాంత్

కైలాస్‌నగర్: జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు, టీజేఏసీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సామల ప్రశాంత్ ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో చేరిన ఆయనకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు.

మళ్లీ మోదీని ప్రధానిగా గెలిపించాలి



నేరడిగొండ: ప్రచారం చేస్తున్న నాయకులు

నేరడిగొండ: కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి నరేంద్ర మోదీని మరోసారి ప్రధాని చేయాలని బీజేపీ మండల కన్వీనర్ సాబ్లే సంతోష్ సింగ్ కోరారు. ఆదివారం మండలంలోని కిష్టాపూర్, శంకరాపూర్, రోల్‌మామడ, దేవుల్‌తండా, గుత్పాల, యాపల్‌గూడ, ఇస్రుగూడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి గొడం నగేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జాదవ్ పరశురాం, గాదె శంకర్, పీవీ రమణ, భూమేష్, భీంరావు, కోటేశ్వర్, రాజేశ్వర్, రాజు, పృథ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: దేశ ప్రజలు మోదీ పాలన కోరుకుంటున్నారని బీజేపీ జిల్లా కార్యవర్గసభ్యులు జక్కుల వెంకటేశ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ ఎన్నికల ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో బారె భోజన్న, నల్ల గంగయ్య, రాజన్న, రోహిత్ పాల్గొన్నారు.

'జనజాతర'కు తరలిన కాంగ్రెస్ నాయకులు



జనజాతరకు వెళ్తున్న నాయకులు

నేరడిగొండ: నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించే జనజాతరకు కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆధ్వర్యంలో నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మండల కన్వీనర్ ఆడే వసంత్‌రావు, ప్రఫుల్‌చందర్ రెడ్డి, ఏలేటి రాజశేఖర్ రెడ్డి, బద్దం పోతారెడ్డి, గంధం నవీన్, హీరాసింగ్, తొడసం శంకర్, రాహిల్ మలిక్, ఆసిఫ్ పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మ నుంచి ఆదివారం నిర్మల్‌లో జరిగిన రాహుల్ బహిరంగ సభకు కాంగ్రెస్ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు అజీం సుల్తాన్ మాట్లాడుతూ.. రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మోజార్టీతో గెలిపించాలని కోరారు.

మార్క్స్ ఆశయ సాధనకు పోరాడుదాం



నివాళులర్పిస్తున్న నాయకులు

ఎదులాపురం: కమ్యూనిస్టు యోధులు, సిద్ధాంత కర్త, ప్రపంచ కార్మికోద్యమానికి వర్గపోరాట విముక్తి ఆయుధాన్ని అందించిన కారల్ మార్క్స్ ఆశయ సాధనకు పోరాడుదామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా కారల్ మార్క్స్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాస్తూ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ల రద్దు కోసం, ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకానికి, కార్మికులందరికీ కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు పండుగ పొచ్చన్న, అగ్గిమల్ల స్వామి, నగేశ్, ఊశన్న, ఆత్మరాం, దశాంత్, నీత్ పాల్గొన్నారు.

ఎదులాపురం: కార్మికవర్గ విముక్తి ప్రధాత కారల్ మార్క్స్ 206వ జయంతిని ఆదివారం సీపీఎం ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు మంజుల, పొచ్చక్క పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



బహుమతి అందజేస్తున్న బలరాం జాదవ్

ఇచ్చోడ: మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో ఆదివారం ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను ప్రారంభించారు. మొదటి బహుమతి రూ. 20 వేలు, రెండో బహుమతి రూ 15 వేలు, మూడో బహుమతి రూ.10 వేల నగదుతో పాటుగా గెలుపొందిన జట్లకు ట్రోఫీ అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈపోటీలు వారం రోజుల పాటు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు.

నేరడిగొండ: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని వడూర్ గ్రామంలో గత 15 రోజులుగా జరుగుతున్న వడూర్ ప్రీమియర్ లీగ్–2 ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గెలుపొందిన జట్లకు బహుమతులు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికితీసేందుకు క్రీడలు దోహదపడుతాయన్నారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కిషోర్, విరేష్, నరేశ్, రాకేశ్, ఆదుముల్ల రాములు, కొప్పుల గంగారెడ్డి, గాదె గంగయ్య, రాంగుడ్ల రాజేశ్వర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను చిత్తుగా ఓడించాలి

- ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి



నార్నూర్: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



తాంసి: ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నార్నూర్: అసమర్థ కాంగ్రెస్, బీజేపీ పార్టీలను పార్లమెంటు ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. ఆదివారం గాదిగూడ మండలంలోని డాబా, గాదిగూడ, ఖండోప్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు. అబద్ధాల హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఏం చేసిందో చెప్పాలన్నారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు యోగేష్, ఎంపీపీ చంద్రకళ రాజు, పూసం బాధిరావు, సయ్యద్ ఖాషిమ్ పాల్గొన్నారు.

నేరడిగొండ: ఆదిలాబాద్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించాలని ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. ఆదివారం మండలంలోని వాగ్దారి, మాధాపూర్, వెంకటాపూర్, కుంటాల(కె), పట్‌పట్‌తాండ, చిన్నబుగ్గారం గ్రామాల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఏలేటి మహేందర్ రెడ్డి, అల్లూరి శివారెడ్డి, జహీర్, సుజీల్, విశాల్, రాథోడ్ సురేందర్, శ్రీనివాస్ రెడ్డి, మద్దెల నారాయణ, కరణ్‌సింగ్ పాల్గొన్నారు.

తాంసి: మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల నాయకులు ఆదివారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. గడిచిన పదేళ్లలో బీఆర్‌ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి ఆదిలాబాద్ ఎంపీగా ఆత్రం సక్కును గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమణ, కృష్ణ, వినోద్ రెడ్డి, రజనీకాంత్, నాగారెడ్డి, గోవర్ధన్, కొడాల మహేందర్, రాహుల్ రెడ్డి పాల్గొన్నారు.

బోథ్: ప్రజలు కేసీఆర్‌ను గుర్తుకు తెచ్చుకుంటున్నారని, కేసీఆర్ పాలనే బాగుందని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండలంలోని పొచ్చెర గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును ఆదిలాబాద్ ఎంపీగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, సురేందర్ యాదవ్, రమణ గౌడ్, శ్రీధర్ రెడ్డి, ఎల్కరాజు, రఫి, అల్లకొండ ప్రశాంత్, వినయ్, బాబుసింగ్, ప్రవీణ్ పాల్గొన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును ఎంపీగా గెలిపించాలని బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం మండలంలోని కనుగుట్ట గ్రామంలో ఎన్నికల ప్రచారం చేశారు. కార్యక్రమంలో శ్రీధర్ రెడ్డి, నవ్వ రవి, అశోక్, రమేశ్, గంగమల్లు, అల్లకొండ ప్రశాంత్, చందు, బాబుసింగ్, రూప్‌చంద్, రవీందర్ పాల్గొన్నారు.

'పాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం'



దప్పు కొడుతున్న జోగు రామన్న

జైనథ్: పాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడారు. అబద్ధాపు హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. అలాంటి ప్రభుత్వానికి పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పాలన్నారు. ఆయన వెంట ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, సర్పన్ లింగారెడ్డి, పెందూర్ దేవన్న, రోకండ్ల రమేష్, యాసం నర్సింగ్ రావ్, దుమాల దేవన్న ఉన్నారు.